క్లుప్తంగా

రంగనాథునికి తైలాభిషేకం నేడు

నెల్లూరు(బృందావనం) : రంగనాయకులపేటలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో ఆదివారం ఉదయం 9.30 గంటలకు మూలవర్లకు తైల సమర్పణ(తైలాభిషేకం) జరుగనుందని దేవస్థానం ఈఓ ఆళ్ల శ్రీనివాసరెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు శనివారం తెలిపారు. భక్తులు వీక్షించి స్వామివారిని దర్శించుకోవాలని కోరారు.

ఎమ్మెల్సీ పరామర్శ

నెల్లూరు(బారకాసు) : అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటికి చేరిన 42వ డివిజన్ వైఎస్సార్‌సీపీ నాయకుడు అబ్దుల్‌మస్తాన్‌ను ఎమ్మెల్సీ, పార్టీ నెల్లూరు సిటీ ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి జెండావీధిలోని ఆయన ఇంటికి వెళ్లి శనివారం పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని, అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖలీల్‌అహ్మద్, కార్పొరేటర్ కరిముల్లా, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీపీఎం సభలను జయప్రదం చేయాలి


కరపత్రాలను అందజేస్తున్న సీపీఎం నాయకులు

నెల్లూరు(అర్బన్) : ఈనెల 18, 19వ తేదీల్లో హరనాథపురంలోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో జరిగే నెల్లూరు రూరల్ నియోజకవర్గ సీపీఎం నాలుగో మహాసభలను జయప్రదం చేయాలని ఆపార్టీ రూరల్ కార్యదర్శి వర్గసభ్యుడు కొండా ప్రసాద్ కోరారు. ఈ మహాసభలను విజయవంతం చేయాలంటూ కొత్తూరు, టైలర్స్ కాలనీ తదితర ప్రాంతాల్లో శనివారం ఆ పార్టీ నాయకులు ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. 19న అపోలో సెంటర్ నుంచి ముత్తుకూరు గేట్ వరకు భారీ ప్రదర్శన నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పార్టీ రూరల్ కమిటీ సభ్యులు నాగేశ్వర్‌రెడ్డి, ఖలీల్, 31వ డివిజన్ శాఖా కార్యదర్శి సుధాకర్, జబ్బార్, మాబాషా పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ పట్టాలకై పోరాటం చేస్తాం


ఇంటింటి ప్రచారంలో సీపీఎం నగర కార్యదర్శి శ్రీనివాసులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని 53, 54వ డివిజన్‌లో పేదలు ఉంటున్న ఇళ్లకు, స్థలాలకు రిజిస్ట్రేషన్ సౌకర్యం లేదని, దీని కోసం దశల వారీగా పోరాటాలు సాగిస్తామని సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు తెలిపారు. 53, 54 డివిజన్ల పరిధిలోని వెంకటేశ్వరపురం, ఇస్లామ్‌పేట పరిసర ప్రాంతాల్లో శనివారం సీపీఎం ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించి కరపత్రాలను అందజేశారు. 53, 54 డివిజన్లలో పేదల స్థలాలకు రిజిస్ట్రేషన్ సౌకర్యం, పట్టాల కోసం 4వ తేదీ సోమవారం వెంకటేశ్వరపురం సెంటర్‌లో సామూహిక ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. రెండు డివిజన్లకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు మూలం ప్రసాద్, నరసింహ, గడ్డం శ్రీనివాసులురెడ్డి, మణి, రవి, సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

ట్రూ అప్ చార్జీలను ప్రభుత్వమే భరించాలి


సౌత్‌మోపూరు సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

నెల్లూరు సిటీ : ట్రూ అప్ చార్జీలను రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఆలూరు తిరుపాలు, మండల కార్యదర్శి పూడిపర్తి జనార్దన్ డిమాండ్ చేశారు. నెల్లూరు రూరల్ మండలంలోని సౌత్‌మోపూరు సబ్‌స్టేషన్ వద్ద వారు శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ట్రూ అప్ చార్జీల భారాలను ప్రజలపై వేయడం తగదన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం నిత్యావసర సరుకులు, పెట్రోల్ డీజిల్ ధరలు పెరిగిపోయాయని, ఈ క్రమంలో ప్రజలపై అదనపు భారం వేయడం తగదన్నారు. కార్యక్రమంలో సీపీఎం నెల్లూరు కమిటీ సభ్యులు ఎంవీ రమణ, వెంకయ్య, జానా లక్ష్మీప్రసాద్, ఆదిశేషయ్య, పాదర్తి మస్తానయ్య, పర్చూరు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

డిస్కౌంట్ల జాతర.. నాణ్యతకు పాతర

- ఆన్‌లైన్ ఫుడ్ ఆర్డర్స్‌పై అనేక అనుమానాలు
- తగ్గింపు ధర పేరిట నాణ్యతకు తిలోదకాలు
- నగరంలోని పలు హోటళ్ల నిర్వాకం



నెల్లూరు(బారకాసు) : నచ్చిన ఆహారం ఆన్‌లైన్‌లో మంచి డిస్కౌంట్‌తో లభిస్తోందని ఆర్డర్ ఇస్తున్నారా..? ఒక్కసారి ఆలోచించాల్సిందే. ఆన్‌లైన్‌లో ఆర్డర్ ఇచ్చిన ఆహారంలో నాణ్యతాలోపం ఉందంటూ అధికారులకు ఫిర్యాదులు అందుతున్నాయి. ఆన్‌లైన్ వినియోగదారుల విషయంలో జిల్లాలో ప్రధాన రెస్టారెంట్లు, హోటళ్ల యజమానులు జిమ్మిక్కులకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. ఆన్‌లైన్‌లో ఆర్డర్ ఇచ్చిన ఆహారానికి ఒక రకమైన నాణ్యత.. రెస్టారెంట్‌కు వచ్చే వినియోగదారులకు మరో నాణ్యతను పాటిస్తున్నారు. నెల్లూరు నగరంలోని పలు హోటళ్లలో నాణ్యతా ప్రమాణాలను పరిశీలించిన అధికారులకు రెండు మూడు రోజుల మాంసం, ఆహార పదార్థాలను గుర్తించారు. తీవ్రస్థాయిలో యజమానులకు హెచ్చరికలు జారీ చేశారు. మరోదఫా ఇలాంటివి పునరావృతమైతే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.



ఇలా ఉంటుంది

పాలక్ పన్నీర్ అసలు ధర రూ.200.. మీకోసం రూ.135కే అందిస్తున్నాం. చికెన్ బిర్యానీ రూ.250.. ప్రత్యేక ఆఫర్ కింద రూ.159కే అందిస్తున్నాం. ఈ ఆఫర్ రెండు రోజుల మాత్రమే. నాటుకోడి బిర్యానీ అసలు ధర రూ.300.. ఈరోజు ప్రత్యేక ఆఫర్‌గా రూ.180కే అందిస్తున్నాం. అంటూ 15, 20, 30, 60 శాతం డిస్కౌంట్‌తో ఫుడ్ డెలివరీ సంస్థలు ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నాయి. ధర తక్కువ కదా అని ఆన్‌లైన్‌లో ఆహారాన్ని ఆర్డర్ చేస్తే అందులో నాణ్యత ఏమాత్రం ఉండడం లేదని ఇటీవల కాలంలో పలువురు వినియోగదారులు అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ సంస్థలతో పాటు రెస్టారెంట్లపై వినియోగదారుల ఫిర్యాదులతో సంబంధిత శాఖాధికారులు పలు హోటళ్లు, రెస్టారెంట్లపై దాడులు చేసి చర్యలు తీసుకుంటున్నారు.

వేర్వేరుగా వండేస్తున్నారు

ఎక్కడో వండిన వంటకాలను రెస్టారెంట్‌కు తీసుకొచ్చి ఆన్‌లైన్ వినియోగదారులకు అందజేస్తున్నట్లు అధికారుల దృష్టికి వచ్చింది. ఇలా వండిపెట్టేందుకు చిన్న హోటళ్ల యాజమాన్యాలతో ఒప్పందం కుదుర్చుకుంటున్నట్లు సమాచారం. నాణ్యత పాటించకుండా వండిన ఆహారం వినియోగదారులకు చేరేసరికి పూర్తిగా పాడైపోతున్న సందర్భాలున్నాయి.

జాగ్రత్తలు పాటిస్తే మేలు

రెస్టారెంట్లు, హోటళ్లకు వెళ్లిన సమయంలో, ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ సంస్థల్లో నచ్చిన ఆహారాన్ని ఎంపిక చేసుకునేటప్పుడు కొన్ని జాగ్రత్తలు పాటించడం మంచిది. ప్రముఖ రెస్టారెంట్లు, ఎప్పుడూ జనసందోహం ఉండే హోటళ్లను ఎంపిక చేసుకోవడం ఉత్తమం. ఎందుకంటే ఆహారం నిల్వ ఉండేందుకు అవకాశం తక్కువ. ముఖ్యంగా నాన్‌వెజ్ ఆహారం కొనుగోలు చేస్తున్న సమయంలో ఇలాంటి జాగ్రత్తలు పాటించాలి. కొన్ని హోటళ్లలో డిమాండ్ తగ్గిన సమయంలో మాంసం, తరిగిన కూరగాయలు తదితరాలను నిల్వ చేసేందుకు ప్రయత్నిస్తుంటారు. ఇలా మిగిలిపోయిన వాటితో వండిన ఆహారం త్వరగా పాడయ్యే ఆస్కారం ఉంది.

నాణ్యమైన ఆహారాన్నే అందించాలి



తాజాగా, నాణ్యమైన ఆహారాన్నే వినియోగదారులకు అందించాలి. ఆహారంలో రంగులు కలపడం ద్వారా కేన్సర్ వచ్చే అవకాశం ఉంది. హోటళ్లు, రెస్టారెంట్లు, ఫుడ్‌కోర్టుల యజమానులు నాణ్యతకు తిలోదకాలు ఇస్తే శాఖాపరమైన చర్యలు తప్పవు. ఆహారానికి సంబంధించి ఏవైనా అనుమానం కలిగినా, నాణ్యత ప్రమాణాలు లేకపోయినా 89781 32489 నంబర్‌కు సమాచారం అందిస్తే చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ చైతన్య, ఆరోగ్యాధికారి, నగరపాలక సంస్థ, నెల్లూరు

శివ భక్తులకు వస్త్రాల పంపిణీ



నెల్లూరు(బృందావనం) : కార్తీక మాసం సందర్భంగా శివదీక్ష చేపట్టనున్న భక్తులకు వస్త్రాలను శనివారం పంపిణీ చేశారు. నగరంలోని మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ ఆల్తూరు గిరీష్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, జిల్లా దేవదాయశాఖ అధికారి కోవూరు జనార్దన్‌రెడ్డి, ఈఓ శ్రీనివాసరావు చేతుల మీదుగా వీటిని అందించారు.

కొరుటూరులో వైద్యశిబిరం



ఇందుకూరుపేట : మండలంలోని కొరుటూరులో పశువులకు సంబంధించి ఉచిత గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పశుసంవర్థకశాఖ అధికారి కె.రమేష్ నాయక్ పాడిరైతులకు పలు సూచనలు చేశారు. మేలైన పశుజాతి ఉత్పత్తిపై అవగాహన కల్పించారు. కృత్రిమ గర్భధారణ ద్వారా పెయ్యదూడలను పొందవచ్చని తెలియజేశారు.

సింహపురికి కార్తీక శోభ


ఆకాశదీపాన్ని వెలిగిస్తున్న అర్చకులు


ప్రత్యేకాలంకరణలో మూలస్థానేశ్వరస్వామి


విశేష పుష్పాలంకరణలో ఆలయ ప్రాంగణం

- భక్తిశ్రద్ధలతో కార్తీక మాసం ప్రారంభం

నెల్లూరు(బృందావనం) : పవిత్ర కార్తీక మాసం సింహపురిలో శనివారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. నగరంలోని ఉమామహేశ్వరుల కొలువులు కొత్తశోభను సంతరించుకున్నాయి. నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న ఉమామహేశ్వరుని నిలయాల్లో శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పార్వతీ పరమేశ్వరులను ప్రసన్నం చేసుకునేందుకు తరలివచ్చిన భక్తజనంతో నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న శివపార్వతుల కొలువులు కిటకిటలాడాయి. భక్తులు ఆది దంపతులను దర్శించుకుని పరవశించిపోయారు.

- మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో రాత్రి ఆకాశదీప ప్రారంభ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం అఖండ దీపారాధన, స్వామివారి వెండినంది సేవలో పేట ఉత్సవం కనుల పండువగా జరిగింది. విశేష పుష్పాలంకరణలో స్వామివారు భక్తులను కటాక్షించారు. ఆకాశదీపం, విశేష పుష్పాలంకరణ ఉభయకర్తలుగా ఆనం వివేకానందరెడ్డి జ్ఞాపకార్థం కుమారులు వ్యవహరించారు. అఖండ దీపారాధన ఉభయకర్తలుగా ఆల్తూరు గిరీష్‌రెడ్డి- లత దంపతులు, పేట ఉత్సవం ఉభయకర్తలుగా గోగుల నాగరాజు వ్యవహరించారు.


స్వామివారి పేట ఉత్సవం

రోడ్లను అభివృద్ధి చేస్తాం


పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

నెల్లూరు(సెంట్రల్) : నగరంలో రోడ్లను అభివృద్ధి చేస్తామని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. రూరల్ పరిధిలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం ప్రాంతంలోని గుంతల రోడ్లకు మరమ్మతుల కార్యక్రమాన్ని కలెక్టర్ ఆనంద్‌తో కలిసి ఎమ్మెల్యే శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ రోడ్లపై ఎక్కడ గుంతలు ఉన్నా వాటిని పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

- రూరల్ పరిధిలోని ఐదుగురికి సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి అందజేశారు.

ఏఆర్ ఎస్సైకు సన్మానం



నెల్లూరు(క్రైమ్) : పోలీస్‌శాఖలో సుదీర్ఘకాలం సేవలందించి పదవీ విరమణ పొందిన ఏఆర్‌ఎస్సై ఇమామ్ సాహెబ్‌ను శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ జి.కృష్ణకాంత్ ఘనంగా సన్మానించారు. జ్ఞాపికను అందజేసి ఆయన సేవలను కొనియాడారు. శేషజీవితం ఆయురారోగ్యాలతో హాయిగా జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, ఏఆర్ డీఎస్పీ వెంకటేశ్వరరావు, ఏఓ చంద్రమౌళి, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాదరావు, ఆర్‌ఐ రాజారావు, ఎస్‌బీ–2 ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి, ఏఆర్‌ఎస్సై కుటుంబసభ్యులు పాల్గొన్నారు.





ఆరోగ్య యోగం

నెల్లూరు దర్గామిట్టలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అండర్ – 14, 17 విభాగాల్లో 68వ రాష్ట్రస్థాయి యోగా చాంపియన్‌షిప్ –2024 పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. వీటిలో అన్ని జిల్లాల నుంచి బాలబాలికలు పాల్గొన్నారు. వారి యోగా విన్యాసాలు ఆకట్టుకున్నాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



పెన్షనర్ల జిల్లా కార్యవర్గ సమావేశం రేపు

నెల్లూరు(బృందావనం) : బీవీనగర్‌లోని పెన్షనర్ల సంక్షేమ భవనంలో స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా శాఖ కార్యవర్గ సమావేశం సోమవారం ఉదయం 9.30 గంటలకు జరుగనుందని ఆ అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్ఎం.గౌస్, ఎస్వీవీఎస్ మూర్తి శనివారం తెలిపారు. ఈ సందర్భంగా పెన్షనర్లకు డాక్టర్ అగర్వాల్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. పెన్షనర్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించనున్నట్లు తెలియజేశారు. ఈ సమావేశానికి అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం విచ్చేస్తారన్నారు.

యంత్రాలతో ఉపాధి పనులు

- అరికట్టాలని పీడీకి వినతి


పీడీ గంగాభవానీకి వినతి పత్రం అందజేస్తున్న సంఘ నాయకులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : జిల్లాలో ఉపాధి హామీ పనులను నిబంధనలకు విరుద్ధంగా యంత్రాలతో సాగిస్తున్నారని, దీనిని వెంటనే ఆపాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మంగళ పుల్లయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరంలోని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం జిల్లా పీడీ కార్యాలయంలో పీడీ గంగాభవానికి శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో కొందరు ఉపాధి సిబ్బందిని బెదిరించి యంత్రాలతో పనులు సాగిస్తున్నారని ఆరోపించారు. 60 శాతం పనులను మాత్రమే కూలీలతో చేస్తున్నారన్నారు. వెంటనే అధికారులు స్పందించి యంత్రాల వినియోగాన్ని అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దేవదానం పాల్గొన్నారు.

పచ్చ నేతలకే దుకాణాలు!


మైపాడు గేటు వద్ద ఏర్పాటు చేసిన దుకాణాలు


నిర్మాణంలో ఉన్న మరో దుకాణం

- మైపాడు గేటు సెంటర్‌లో నిర్మాణం
- పొదుపు మహిళల పేరిట టీడీపీ అనుచరులకు కట్టబెట్టేందుకు కుట్ర

నెల్లూరు సిటీ : నగరంలోని మైపాడుగేటు సెంటర్‌లో వెడల్పు చేసిన రోడ్డులో దుకాణాలను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఆదేశాలతో అధికారులు నాలుగు మోడల్ దుకాణాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇలా మైపాడు గేటు నుంచి బోడిగాడితోట వరకు దాదాపు 20 దుకాణాలను ఏర్పాటు చేసేందుకు ప్రక్రియ మొదలైంది. ఈ క్రమంలో కార్పొరేషన్ అధికారులు శుక్రవారం రెండు మోడల్ దుకాణాలను ఏర్పాటు చేశారు.

పొదుపు మహిళల పేరుతో..

దాదాపు 20 దుకాణాల నిర్మాణం చేపట్టి వాటిని పొదుపు మహిళలకు కేటాయించేందుకు క్షేత్రస్థాయి ప్రక్రియ ప్రారంభించారు. అయితే వారికి కేటాయిస్తున్నట్లు చెప్పి టీడీపీ పార్టీకి అనుకూలంగా పనిచేసిన పొదుపు మహిళలకు దుకాణాలను కట్టబెట్టనున్నారు. ఆయా దుకాణాలు పసుపు రంగుతో నిర్మాణాలు జరుగుతోంది.

ఆందోళనకు సిద్ధంగా బాధితులు

రోడ్డు వెడల్పులో భాగంగా దుకాణాలు, ఇళ్లను కోల్పోయిన బాధితులు ఆందోళన చేసేందుకు సిద్ధమైనట్లు సమాచారం. తమకు కేటాయించకుండా టీడీపీ అనుచరులకు దుకాణాలు కేటాయించేందుకు చర్యలు తీసుకోవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో గోవర్ధనగిరి పూజ





నెల్లూరు(బృందావనం) : మినీబైపాస్‌రోడ్డు దగ్గర ఇస్కాన్‌సిటీలో ఉన్న ఇస్కాన్ మందిరంలో గోవర్ధనగిరి పూజను శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇస్కాన్ మందిర అధ్యక్షుడు డాక్టర్ శుకదేవస్వామి ఉపన్యసించారు. అనంతరం గో పూజ ను నిర్వహించారు. భక్తులు విశేషంగా విచ్చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.